


8 లో

హలీమ్.. రుచికి సలామ్

ఏటా రంజాన్ మాసంలో రాజమహేంద్రవరంలో సాయంత్రం 4 గంటలు దాటాక కులమతాలకతీతంగా, కుటుంబ సమేతంగా హలీమ్ షాపులకు రావడం పరిపాటిగా మారింది.



డెల్టాకు 9,650 క్యూసెక్కులు

ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం 9,650 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,850, మధ్య డెల్టాకు 1,800, పశ్చిమ డెల్టాకు 5,000 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజీ వద్ద 9.50 నీటిమట్టం అడుగులకు చేరింది.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ సోమవారం (సాయంత్రం)	సహర్ మంగళవారం (ఉదయం)
రాజమండ్రి	6.20	4.53
కాకినాడ	6.20	4.53
అమలాపురం	6.20	4.53

న్యూస్‌రీల్

12న ఫీజు పోరును విజయవంతం చేయండి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత

పిఠాపురం: రాష్ట్ర వైఎస్సార్ సీపీ పార్టీ అధిష్టానం పిలుపు మేరకు ఈనెల 12న నిర్వహించనున్న ఫీజు పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంగా గీత పిలుపునిచ్చారు. ఆమె ఆదివారం మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించిందని ఆమె విమర్శించారు. విద్యార్థుల ఫీజు బకాయిలు విడుదల చేయాలని కోరుతూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో విద్యార్థులకు అండగా జిల్లా కేంద్రం కాకినాడలో ఫీజు పోరు కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆమె తెలిపారు. విద్యా దీవెన, వసతి దీవెన పథకాలకు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థుల తరఫున చేపట్టనున్న ఈ కార్యక్రమంలో విద్యార్థులు వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. అదే రోజు పిఠాపురం పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్న వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలను నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని ఆమె పిలుపు నిచ్చారు.

లోవ దేవస్థానంలో భక్తుల సందడి

రూ.3.65 లక్షల ఆదాయం



లోవ దేవస్థానంలో భక్తుల రద్దీ

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారిని దర్శించేందుకు వచ్చిన భక్తులతో లోవ దేవస్థానంలో సందడి నెలకొంది. ఆదివారం వివిధ జిల్లాల నుంచి ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చిన 18వేల మంది భక్తులు క్యూలైన్ల ద్వారా అమ్మవారిని దర్శించుకున్నట్టు ఇన్‌చార్జ్ డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వహణ అధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయం ద్వారా రూ.1,39,305, పూజా టికెట్లకు రూ.86,900, కేశఖండన శాలకు రూ.13,960, వాహన పూజలకు రూ.3,890, వసతి గదులు, పొంగిలి షెడ్లు, కాటేజీల అద్దెలు రూ.43,756, విరాళాలు రూ.77,609 వెరసి మొత్తం రూ.3,65,420లు ఆదాయం సమకూరినట్టు ఈఓ వివరించారు.

మోరి చేనేత వస్త్రాలకు రాష్ట్రపతి ప్రశంస

సఖినేటిపల్లి: జిల్లాలోని మోరి చేనేత సొసైటీ వస్త్రాలను ఆదివారం న్యూఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంసించారు. నేషనల్ డిజైన్ సెంటర్(సెట్ అప్ మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్) ఆధ్వర్యంలో సౌత్ ఇండియా అమృత్ మహోత్సవ్‌లో ఏపీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మోరి చేనేత స్టాల్‌ను న్యూఢిల్లీలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మోరి చేనేత సొసైటీ స్టాల్‌లోని చేనేత వస్త్రాలను రాష్ట్రపతి పరిశీలించారు. ఆమె వెంట ఏపీ గవర్నర్ ఉన్నారు. చేనేత చీరల తయారీలో కార్మికుల నైపుణ్యాన్ని రాష్ట్రపతి ప్రసంశించినట్టు స్టాల్ సేల్స్‌మన్, మోరికి చెందిన నల్లా ప్రసాద్ తెలిపారు.

మెట్టకు సాగునీటి కష్టం

- రైతు గోడు పట్టని పవన్
- సొంత నియోజకవర్గంలో నీటి ఎద్దడి
- సందిగ్ధంలో శివారు ఆయకట్టు
- సాగునీరు అందక మెట్ట రైతు పాట్లు
- పీబీసీ శివారున ఇదే దుస్థితి
- నిండుకున్న ఏలేరు జలాలు



పిఠాపురం మండలం భోగాపురంలో ఎండిన పంట పొలాల వద్ద రైతుల ఆవేదన

సాక్షి ప్రతినిధి, కాకినాడ: సాగునీటి ఎద్దడితో జిల్లాలో మెట్ట ప్రాంత రైతులు గొల్లుమంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి రబీ సాగునీటి సరఫరాపై ముందుచూపు లేకపోవడం ఈ ప్రాంత రైతులకు శాపంగా పరిణమించింది. ఏలేరులో నీటి కొరతను అధిగమించడంలో కూటమి ప్రభుత్వ వైఫల్యాన్ని రైతు సంఘాల ప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు. జిల్లా అంతా ఒక ఎత్తు పిఠాపురం నియోజకవర్గం పరిస్థితి మరో ఎత్తు అన్నట్టుగా ఉంది. స్వయంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తోన్న పిఠాపురం నియోజకవర్గంలోనే రైతులు సాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. పిఠాపురం నియోజకవర్గంలో సాగునీటి ఎద్దడితో రైతుల గోడు కనీసం పట్టించుకోకుండా జనసేన పార్టీ 12వ వార్షికోత్సవానికి ఏర్పాట్లు చురుగ్గా చేసుకోవడాన్ని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఏలేరు, పిఠాపురం బ్రాంచ్ కెనాల్స్‌పై ఆధారపడ్డ ఆయకట్టు శివారున ఉన్న పలు ప్రాంతాల్లో రబీ సాగు సందిగ్ధంలో పడింది. జనసేనలో నంబర్–2గా ఉన్న నాదెండ్ల మనోహర్ వారం తిరగకుండానే ఒక పర్యాయం పిఠాపురం, రెండు పర్యాయాలు కాకినాడలో పర్యటించినా నియోజకవర్గ రైతుల రబీ కష్టాల వైపు కన్నెత్తి చూడకపోవడాన్ని రైతు సంఘాల ప్రతినిధులు ఆక్షేపిస్తున్నారు. పార్టీ కార్యక్రమాలకు ఇచ్చే ప్రాధాన్యం శివారు ఆయకట్టులో ఇబ్బందులకు ఇవ్వరా అని రైతులు నిలదీస్తున్నారు. రబీ సన్నాహానికి ముందు మాత్రం అధికార యంత్రాంగం పిఠాపురం బ్రాంచ్ కెనాల్ పరిధిలో 32,500 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు సరఫరా చేస్తామని ప్రకటించింది. ఇందులో 22,260 ఎకరాల్లో వరి, 10,240 ఎకరాల్లో అపరాల సాగుకు ఢోకా లేదనడంతో రైతులు గంపెడాశలతో రబీ సాగుకు సమాయత్తమయ్యారు. ఇంతలో ఏలేరులో ఎదురైన నీటి కొరత రైతులకు గుదిబండగా మారింది.

శివారు రైతుల గగ్గోలు

రబీ సీజన్‌లో రైతులు సాగుకు సమాయత్తమయ్యే సమయానికి ఏలేరులో 20 టీఎంసీలు ఉంది. ప్రస్తుతం 12.98 టీఎంసీలు మాత్రమే కనిపిస్తోంది. వీటిలో 4.50 టీఎంసీలు విశాఖ స్టీల్ ప్లాంట్‌కు పోగా మిగిలిన 6.16 టీఎంసీలు డెడ్ స్టోరేజ్‌గా పరిగణిస్తున్నారు. మరో 1.31 టీఎంసీలు ఏలేరు ప్రాంత ఆయకట్టు భూములు 53 వేల ఎకరాలకు అందించాల్సి ఉంది. 28 వేల ఎకరాల్లో వరి, 25 వేల ఎకరాల్లో ఉద్యానవన పంటలకు సాగు నీరు అందించాలి. ఏలేరు పరిధిలో రబీకి సాగునీటి ఎద్దడి కారణంగా పిఠాపురం నియోజకవర్గంలో శివారు ఆయకట్టు ప్రాంతాల్లో రైతులు గగ్గోలు పెడుతున్నారు. పంట చేతికందే దశలో సాగునీటికి కటకటలాడిపోతున్నామని ఆందోళన చెందుతున్నారు. అసలే ఎండల తీవ్రతతో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతోన్న తరుణంలో సాగు నీరు లేక పంట భూములు నెర్రలు బారడంతో ఏలేరు రైతు కంటకన్నీరు పెడుతున్నారు. ఏలేరు రిజర్వాయర్‌లో నిలువలు అడుగంటడంతో శివారు ఆయకట్టు రైతుల పరిస్థితి అడకత్తెరలో పోక చెక్కను తలపిస్తోంది. రిజర్వాయర్‌లో ఉన్న అరకొర నీటిని కాలువల ద్వారా సరఫరా చేసినా ఏలేరుకు ఎగువనున్న ప్రత్తిపాడు, పెద్దాపురం తదితర మండలాల ఆయకట్టుకే సరిపోతోందని చెబుతున్నారు. దిగువన ఉన్న తమ పొలాలకు చుక్కనీరు రావడం లేదని స్థానిక రైతులు మదనపడుతున్నారు.

సర్కారు తీరుపై రైతుల ఆగ్రహం

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో రబీ సీజన్‌లో డెడ్ స్టోరేజీ 6.16 టీఎంసీలు ఉంది. అయినప్పటికీ పంపింగ్ చేసి సాగుకు సరిపడా రెండు టీఎంసీలు సరఫరా చేసి రైతుల కడగండ్లకు ఫుల్‌స్టాప్ పెట్టారు. ఫలితంగా నాడు రబీ పంటకు ఎటువంటి సాగునీటి ఎద్దడి ఎదురు కాకుండా రైతులు పంట పండించారు. ఇప్పుడు ఇందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. రైతులపై మానవత్వం చూపని ప్రభుత్వం ఏలేరు శివారు ఆయకట్టు రైతుల గోడు పట్టించుకోలేదు. ప్రస్తుతం ఏలేరు డెడ్ స్టోరేజ్ 6.16 టీఎంసీలలో 2 టీఎంసీలు పంపింగ్ చేయాలన్న రైతుల డిమాండ్‌ను పట్టించుకునే నాథుడే కరవయ్యాడు. పైకి మాత్రం రైతులంటే వల్లమాలిన అభిమానం ఉన్నట్టుగా చంద్రబాబు సర్కార్ ప్రచారం చేసుకుంటోందని రైతు సంఘాల ప్రతినిధులు ఆక్షేపిస్తున్నారు. ఏలేరు ఆయకట్టు పరిధి రైతుల్లో 70 శాతం మంది కౌలు రైతులే. కౌలుకు తీసుకుని రూ.లక్షలు పెట్టుబడులు పెట్టారు. రబీలో ఎకరాకు రూ.20 వేల వరకు కౌలు చెల్లించి మరో రూ.25 వేలు పెట్టుబడులు పెట్టిన కౌలు రైతులు గగ్గోలు పెడుతున్నారు. రైతులపై కపట ప్రేమ చూపించే కూటమి నేతలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా అధికారంలోకి వచ్చాక మరోలా వ్యవహరిస్తున్నారని రైతులు మండిపడుతున్నారు.

నెర్రలు తీసిన పొలాలు

పిఠాపురం మండలం రాపర్తి, రాయవరం, భోగాపురం, కొత్తపల్లి మండలం ఎండపల్లి, గొల్లప్రోలు మండలంలో శివారు ఆయకట్టుకు సాగునీరు అందక రైతులు ఆందోళన చెందుతున్నారు. భోగాపురం, రాయవరం, రాపర్తి గ్రామాల్లోని ఆయకట్టుకు సాగునీరందడం లేదు. వారం పది రోజులుగా ఇదే దుస్థితి కొనసాగుతోంది. రైతుల మొర ఆలకించే ఓపిక ఈ ప్రాంత ప్రజాప్రతినిధులకు లేకుండా పోయింది. వంతుల వారీగా విడుదల చేసిన నీరు ఎంత మాత్రం సరిపోవడం లేదని రైతులు అంటున్నారు. పంట ఇప్పుడిప్పుడే గింజ గట్టిపడే దశలో ఉంది. సాగు నీటి అవసరం ఇప్పుడే ఎక్కువగా ఉంటుంది. సరిగ్గా ఇదే సమయంలో సాగునీరు అందక పంట పొలాలు నెర్రలు తీసి రైతులు కన్నీరు పెడుతున్నారు.

తొండంగి మండలంలోని శివారు ప్రాంత ఆయకట్టు రైతులు సాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. పిఠాపురం బ్రాంచ్ కెనాల్ పై ఆధారపడ్డ తొండంగి మండలంలోని దిగువ ప్రాంత ఆయకట్టుకు అరకొరగా నీరు అందుతోంది. గొల్లప్రోలు మండలం మల్లవరం చెరువు(ఆర్ఆర్‌బీ ట్యాంక్) నుంచి పిఠాపురం బ్రాంచి కెనాల్ ద్వారా తొండంగి మండలం రావికంపాడు, ఏవి నగరం, కొమ్మనాపల్లి మీదుగా కోదాడ ఉప్పుచెరువుకు సాగునీరు సరఫరా అవుతుంది. ఈ చెరువు ఆయకట్టు కింద శృంగవృక్షంపేట, శృంగవృక్షం, పాత కోదాడ, కొత్తకోదాడ గ్రామాల్లో రబీ సాగవుతోంది. ఈ గ్రామాల్లోని శివారు ఆయకట్టుకు సాగునీటి ఎద్దడి ఏర్పడటంతో ఇటీవల రైతులు ఆందోళనకు దిగారు. విషయం తెలిసి జిల్లా వ్యవసాయాధికారి వచ్చి సమస్య పరిష్కరిస్తామని చెప్పి వెళ్లారు. రెండు, మూడు రోజులు నీటి ఎద్దడి తీరిందనుకుంటుండగా ఇప్పుడు మళ్లీ ఇబ్బంది ఎదురవుతోందని రైతులు చెబుతున్నారు. చిరు పొట్ట దశలో ఉన్న తరుణంలో సాగునీటి ఎద్దడితో నష్టపోతామని రైతులు ఆవేదన చెందుతున్నారు.

మరమ్మతులతో రబీకి నష్టం

ఈ సీజన్‌లో రైతులకు పంపా ఆయకట్టు పరిధిలో రబీ సాగే లేకుండా పోయింది. పంపా ఆయకట్టు రైతులకు గడచిన నాలుగు సంవత్సరాలు స్వర్ణ యుగమనే చెప్పాలి. ప్రతి ఏటా రబీకి ఇబ్బంది లేకుండా అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముందస్తు ఏర్పాట్లు చేసింది. స్థానిక ప్రజాప్రతినిధులు పట్టుబట్టి రబీలో సాగునీటికి ఇబ్బంది లేకుండా చూశారు. అటువంటిది చంద్రబాబు కూటమి ప్రభుత్వంలో పంపా ఆయకట్టు రైతులకు కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. పంపా ప్రాజెక్ట్ కింద 12,500 ఎకరాలు సాగవుతోంది. బ్యారేజీ ఆధునీకరణ పేరుతో రబీ నీరు విడుదలకు బ్రేక్‌లు వేశారు. నాలుగేళ్లుగా రబీలో సాగుచేస్తోన్న రైతులు ఈ రబీలో సాగునీరు లేక పంట గాలికొదిలేశారు. గేట్లు మరమ్మతులకని ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో 3.36 కోట్లు ప్రకటించారు. ఈ నిధులతో గేట్లు మరమ్మతులు నెలాఖరులోపు పూర్తి చేయాలి. లేకపోతే ఆ నిధులు మురిగిపోయే ప్రమాదం ఉంది. ఈ మరమ్మతుల పేరుతో రబీ కోల్పోవాల్సి వచ్చిందని ఆయకట్టు రైతులు లబోదిబోమంటున్నారు.

ఇవీ లెక్కలు..

- జిల్లాలో పంట భూములు– 1,77,030 ఎకరాలు
- గోదావరి డెల్టా – (10 మండలాలు) 1,24,798 ఎకరాలు
- ఏలేరు కాలువ భూములు – (6 మండలాలు) 44,250 ఎకరాలు
- ఏలేరు నిల్వ సామర్థ్యం – 86.56 మీటర్లు
- నీటి నిల్వ సామర్థ్యం– 24.11 టీఎంసీలు
- డెడ్‌స్టోరేజ్ – 6.16 టీఎంసీలు
- కాలువల ద్వారా సరఫరా – 17.95 టీఎంసీలు
- ప్రస్తుతం రిజర్వాయర్‌లో నిల్వ – 12.98 టీఎంసీలు
- ఇన్‌ఫ్లో రోజుకు సగటున – 266 క్యూసెక్కులు
- ఎడమ కాలువకు – 200 క్యూసెక్కులు
- డీసీఆర్‌కు – 500 క్యూసెక్కులు
- స్పిల్‌వే విడుదల – 900 క్యూసెక్కులు

గోడు వినే నాథుడేడి



సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయి. ఎన్నిసార్లు చెప్పినా నీరు ఇవ్వడం లేదు. పంటలు ఎండిపోతుంటే ఏమి చేయాలో తెలియక గుడ్లు అప్పగించి చూస్తున్నాం. సుమారు 40 వేల పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేశా. ఇప్పుడు పంట ఎండిపోతే పెట్టుబడి కూడా రాదు. అన్ని అప్పు చేసి పెట్టినవే పంటలకు నీరు ఇచ్చి ఆదుకోక పోతే ఇక చావే శరణ్యం.

– పోతుల తాతారావు,
కౌలు రైతు, భోగాపురం, పిఠాపురం మండలం

వంతులవారీతో కొంత ఆలస్యం

ఏలేరు శివారు ప్రాంతాలకు వంతుల వారీ విధానం వల్ల కొంత ఆలస్యం అవుతుంది. వంతు వచ్చే సరికి భూమి నెర్రలు తీస్తోంది. తేమ ఉండడం వల్ల పంటలు ఎండిపోవు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వేసవికాలం ముందుగా రావడంతో నీటి ఎద్దడి ఏర్పడింది. ఏలేరు రిజర్వాయర్‌లో తగినంత నీరు ఉంది. కాలువలు బాగోక సరఫరా ఇబ్బంది అవుతోంది. ఉపాధి హామీ పథకంలో కాలువలు శుభ్రం చేయించి నీరు వదులుతున్నాం.

– శేషగిరిరావు,
ఈఈ, నీటిపారుదల శాఖ, ఏలేరు

ప్రజలు కమ్యూనిస్టులను ఆదరిస్తారు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



సీపీఎం నాయకుడు దువ్వా శేషుబాబ్జీ రచించిన నవ సమాజం కోసం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

కాకినాడ సిటీ: అమరవీరుల స్ఫూర్తితో నిరంతరం ప్రజాసేవ చేస్తే ప్రజలు కమ్యూనిస్టులను తప్పనిసరిగా ఆదరిస్తారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం కాకినాడ అన్నదాన సమాజంలో నవ సమాజం కోసం పుస్తకావిష్కరణ సభ సీపీఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు అధ్యక్షతన జరిగింది. ఈ సభలో శ్రీనివాసరావు ముఖ్యవక్తగా మాట్లాడారు. కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర అంటే ఆ కాలంలో ప్రజా పోరాటాల చరిత్రే అన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో స్వాతంత్రోద్యమ కాలంలోనే కమ్యూనిస్టు బీజాలు పడ్డాయన్నారు. ఆనాడు కాకినాడ అన్నదాన సమాజంలో రహస్యంగా పార్టీ ఏర్పడిందన్నారు. 1934–1964 మధ్య జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమ ఘట్టాలను వివరిస్తూ సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దువ్వా శేషుబాబ్జీ నవ సమాజం కోసం పేరుతో పుస్తకం రచించడం అభినందనీయమన్నారు. కమ్యూనిజం అంతరించిపోయిందని ప్రచారం జరిగిన అమెరికాలోనే కమ్యూనిస్టు పేరు వింటేనే ట్రంప్ ఉలిక్కి పడుతున్నారన్నారు. దేశంలో ఆర్థిక సంక్షోభం తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో ప్రజలు ఎర్రజెండా వైపు చూస్తారన్నారు. అమరుల స్ఫూర్తితో ప్రజల నుంచి నేర్చుకుని ఉద్యమాన్ని బలోపేతం చేసుకోవాలన్నారు. డాక్టర్ చెలికాని స్టాలిన్, డాక్టర్ పి.చిరంజీవినీకుమారిలతో పాటు సీపీఐ నాయకులు తాటిపాక మధు, బోడకొండ, కె.సత్తిబాబు, న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి జె.వెంకటేశ్వర్లు, లిబరేషన్ నాయకులు గొడుగు సత్యనారాయ, చిన్నిబిల్లి నాగేశ్వరరావు, సీపీఐ ఎంఎల్ నాయకులు నాగరాజు, కొండ దుర్గారావు, సీపీఎం నాయకులు టి.అరుణ్ తదితరులు సమావేశంలో మాట్లాడారు. దేశాన్ని మతోన్మాద శక్తుల బారి నుంచి కాపాడుకోవాలన్నారు. ఐక్య ఉద్యమాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. శేషుబాబ్జీ కృషిని నాయకులు అభినందించారు. కమ్యూనిస్టు ఉద్యమంలో అమరులైన నాయకుల కుటుంబ సభ్యులు పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సభా ప్రాంగణంలో అమరుల ఫొటోలతో పాటు వారి గురించి క్లుప్తంగా తెలియజేస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. సభకు ముందుగా అమరులకు నివాళులర్పించారు. సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఏవీ నాగేశ్వరరావుతో పాటు రచయిత దువ్వా శేషుబాబ్జీ, నాయకులు జి.బేబీరాణి, కేఎస్ శ్రీనివాస్, పలివెల వీరబాబు, సీహెచ్ రమణి, సీహెచ్ రాజ్‌కుమార్, నీలపాల సూరిబాబు, కె.సత్తిరాజు, మలక వెంకటరమణ, దుంపల ప్రసాద్, కె.నాగజ్యోతి, చంద్రమళ్ల పద్మ, చంద్రావతి, రాణి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

రత్నగిరిపై భక్తుల సందడి

- సత్యదేవుని దర్శించిన 30 వేల మంది
- ఘనంగా సత్యదేవుని రథ సేవ



ఆలయ ప్రాకారంలో సత్యదేవుని రథ సేవ

అన్నవరం: రత్నగిరి వాసుడు సత్యదేవుడిని ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించి పూజలు చేశారు. సెలవు దినం కావడంతో ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. వీరంతా స్వామివారి వ్రతాలాచరించి దర్శనం చేసుకున్నారు. దీంతో సత్యదేవుని ఆలయం వద్ద రద్దీ ఏర్పడింది. సత్యదేవుని దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట సమయం పట్టింది. సత్యదేవుడిని దర్శించిన అనంతరం భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేసి రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించారు. ఆదివారం స్వామివారిని 30 వేల మంది దర్శించగా, వ్రతాలు 1,500 నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం సమకూరింది. సుమారు ఐదు వేల మంది భక్తులకు సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో ఉచిత భోజన సౌకర్యం కలుగచేశారు. ఆదివారం సత్యదేవుని రథసేవ ఆలయ ప్రాకారంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం 11 గంటలకు సత్యదేవుడు, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకువచ్చిటేకు రథంపై ఉంచారు. స్వామి, అమ్మవార్లకు పూజలు చేసిననంతరం పండితులు రథసేవ ప్రారంభించారు. వేదపండితుల మంత్రోచ్చాటన మధ్య, మంగళవాయిద్యాల నడుమ మూడుసార్లు రథంపై ఆలయ ప్రాకారంలో సేవ నిర్వహించారు. సేవ అనంతరం పండితులు స్వామి, అమ్మవార్లకు నీరాజనం ఇచ్చి ఇచ్చారు. వేదపండితులు గొల్లపల్లి ఘనపాఠీ, శివ, యనమండ్ర శర్మ, గంగాధరబట్ల గంగబాబు, అర్చకులు సుధీర్, పరిచారకులు పవన్ తదితరులు కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్తరకంచికి చెందిన భక్తులు రూ.2,500 చెల్లించి రథసేవలో పాల్గొన్నారు. సోమవారం సత్యదేవుడు, అమ్మవారు ముత్యాల కవచాలను (ముత్తంగిసేవ) ధరించి భక్తులకు దర్శనమివ్వనున్నారు.

వినిపించని ఆకలి కేకలు

- మహిళా దినోత్సవం నాటికీ అందని వేతనాలు
- ఉసూరుమంటున్న మహిళా సిబ్బంది
- స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో దయనీయ స్థితి
- వారోత్సవాల పేరుతో అంగన్‌వాడీలకు ప్రత్యక్ష నరకం



కాకినాడ క్రైం: మహిళా దినోత్సవం ముగిసింది, జిల్లాలో ఈ సంబరాలు అంబరాన్ని తాకాయి. వారోత్సవాలతో వారం రోజులూ పండగ వాతావరణం నెలకొంది. ర్యాలీలు, మారథాన్లు, ఆటలు, పాటలు, ఉపన్యాసాలు, మానవహారాలు ఒకటా, రెండా.. విమెన్స్ డే వేడుకలతో జిల్లా దద్దరిల్లింది. ఇది నాణానికి ఓ వైపు మాత్రమే. మరోవైపు సదరు శాఖలో విధులు నిర్వర్తిస్తున్న మహిళా ఉద్యోగులు ఎవరికీ జీతాలు లేవు. ఊకదంపుడు ఉపన్యాసాల్లో మాటలన్నీ ముఖస్తుతికేనన్న విషయం తేలిపోయింది. గతేడాది ఆగస్టు నుంచి గొడ్డు చాకిరీ చేస్తున్నా జీతాలకు మాత్రం వారు నోచుకోలేదు.

కష్టపడి పని చేసినా వారికి జీతం ఇవ్వడం లేదు. ఈ దుస్థితి ఇంకేదో డిపార్టుమెంట్‌లో కాదు. మహిళా భద్రత, భవిత, భరోసా కోసం నిర్దేశించిన స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులదే. పేరుకు తగ్గట్టుగానే జిల్లాలో ఈ శాఖలో మహిళా ఉద్యోగులే ఎక్కువ. ఈ డిపార్టుమెంట్‌లో ఉన్న మూడు కీలక ప్రాజెక్టుల్లో పని చేస్తున్న సుమారు 800 మంది కాంట్రాక్టు ఉద్యోగులకు నెలల తరబడి జీతాల్లేకపోవడంతో, అప్పులపాలై వారి కుటుంబాలు రోడ్డున పడే దుస్థితి నెలకొంది. శనివారం మహిళా దినోత్సవం సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు ఎన్నో ఉపన్యాసాలు ఇచ్చారు. కానీ సిబ్బంది ఆకలి కేకలు వారిలో ఏ ఒక్కరికీ వినిపించ లేదు. విమెన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ డిపార్టుమెంట్‌లో ఉన్న రెగ్యులర్ ఉద్యోగులకు జీతాలు అందుతుండగా, వారంతా అధికార హోదాలో కొనసాగుతున్నారు. క్షేత్ర స్థాయిలో వారు నిర్దేశించే ప్రతి పని పూర్తి చేయాల్సిన కష్టం.. చిరుద్యోగులైన కాంట్రాక్టు సిబ్బందిదే. ఈ డిపార్టుమెంట్ పరిధిలో సేవలందిస్తున్న ఐసీడీఎస్‌కు చెందిన అంగన్‌వాడీలకు ఈ నెలలో నేటికీ జీతాలే పడలేదు. వీరంతా మహిళలే, కనీసం 600 మంది ఉంటారు. అంగన్‌వాడీ కేంద్రాల అద్దెలను కూడా వీరు తమ జీతాల నుంచే చెల్లిస్తారు. ఈ అద్దెలు విడుదల చేసి ఆరు నెలలకు పైగా అయింది. సీమంతాల కోసం ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త చేతిలో సొంత డబ్బు వెచ్చిస్తారు. నెలవారీ రూ.500 చొప్పున ఖర్చు చేస్తారు. ఇవి తిరిగి చెల్లించి ఏడాది కావస్తోంది.

తప్పని నరకయాతన

మహిళా దినోత్సవాల పేరుతో అంగన్‌వాడీలు ప్రత్యక్ష నరకం చూశారు. అధికారులు వీరితో ఓ ఆటాడుకున్నారు. జీతాలు నేటికీ రాకపోయినా చాకిరీ చేయించారు. ఠంచనుగా జీతాలు తీసుకుంటున్న రెగ్యులర్ హోదాలో కొనసాగుతున్న ఉద్యోగులకు విధి నిర్వహణలో ఇంతటి కష్టం లేదు. అధికార హోదాలో వారు తీవ్రమైన పని ఒత్తిడిని అంగన్‌వాడీలపై పెడుతున్నారు. వారోత్సవాలంటూ రేయింబవళ్లు తేడా లేకుండా పోయింది. ర్యాలీలు, మారథాన్లకు ఉదయాన్నే వచ్చి వాలిపోవాలన్నారు. రానివారికి మెమోలు ఇస్తామని బెదిరించారు. వచ్చి పడిగాపులు కాస్తే అధికారులు ఎప్పటికో తీరికగా కార్లు దిగేవారు. పోషకాహార గొప్పతనాన్ని చెబుతూ, ప్రతి అంగన్‌వాడీ సిబ్బంది రెండు, మూడు రకాల చిరుధాన్యాల వంటలు వండి తేవాలన్నారు. ఆకలి పస్తులున్నా, ఆటల్లో పాల్గొనక తప్పదని ఒత్తిడి తెచ్చారు. వీటన్నింటినీ మించి ఇల్లూ వాకిలి వదిలి, పిల్లలు, భర్తను విడిచి ఉదయాన్నే వాలిపోవాలంటూ హుకుం జారీ చేశారు.

మూడు నెలలు దాటినా..

అలాగే ఐసీపీఎస్, శిశు గృహ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు జీతాలు చేతికంది మూడు నెలలు దాటింది. ఇదే పరిధిలో ఉన్న దిశ వన్‌స్టాప్ సెంటర్ ఉద్యోగులకు గతేడాది ఆగస్టు తర్వాత జీతాలే లేవు. వీరంతా ఆకలి పస్తులుంటూ, అప్పులు చేసుకుంటూ, వారి జీవితాలను నెట్టుకొస్తున్నారు. కష్టాన్నంతా పంటికింద బిగువ పట్టి ఉద్యోగాలు చేస్తున్నారు. కనీసం తమ ద్విచక్ర వాహనాల్లో పెట్రోల్‌కైనా చేతిలో చిల్లిగవ్వ ఉండడం లేదంటూ తమ ఆవేదనను వెళ్లబోసుకుంటున్నారు. జీతాలు ఇవ్వకున్నా ఫీల్డ్ వర్క్ తప్పడం లేదని చెబుతున్నారు.

ఉన్నతాధికార్లకు నివేదించాం

సిబ్బందికి జీతాలు చెల్లించలేదనేది వాస్తవమే. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాం. ఫైల్ కూడా పంపించాం. త్వరలో పరిష్కారం అవుతుందని ఆశిస్తున్నాం.

– కె.విజయకుమారి,
పీడీ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ,
కాకినాడ

క్లుప్తంగా

బీసీ, ఓబీసీ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షునిగా వీరబ్రహ్మం

- మహిళా అధ్యక్షురాలిగా హేమలత



వీరబ్రహ్మం దంపతులను సత్కరిస్తున్న నాయకులు

అన్నవరం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ, ఓబీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నూతన అధ్యక్షునిగా విద్యా శాఖలో పనిచేస్తున్న గుత్తుల వీరబ్రహ్మం , మహిళా విభాగం అధ్యక్షురాలిగా దేవదాయ శాఖలో పనిచేస్తున్న హేమలత ఎన్నిక య్యారు. ఆదివారం స్థానిక రాఘవేంద్ర ఫం క్షన్ హాలులో రాష్ట్ర స్థాయి బీసీ, ఓబీసీ ఉద్యో గుల సంఘం రాష్ట్ర కౌన్సిల్ జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌పీఆర్ విఠల్‌కుకుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సంఘ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షునిగా చొల్లంగి శ్రీధర్‌ను ఎన్నుకున్నారు. ఈ సమావే శంలో రాష్ట్రం నలుమూలల నుంచి బీసీ, ఓబీసీ ఉద్యోగ సంఘాల నాయకులు, అన్నవరం దేవస్థాన బీసీ ఉద్యోగులు హాజరయ్యారు.

సత్యదేవుని దర్శించిన ఇండియన్ నేవీ బృందం



సత్యదేవుని ఆలయం వద్ద ఇండియన్ నేవీ బృందం

అన్నవరం: ఇండియన్ నేవీలో ఉద్యోగ అవ కాశాలు వివరిస్తూ కోల్‌కతా నుంచి కన్యాకు మారికి సుమారు 3,800 కిలోమీటర్లు 30 కార్లలో ర్యాలీ చేస్తున్న 30 మంది ఇండియన్ నేవీ ఉద్యోగుల బృందం ఆదివారం రత్నగి రిపై సత్యదేవుని దర్శించింది. ఈ సందర్భం గా స్వామివారికి పూజలు చేశారు. యువ కులు నేవీలో చేరి, దేశానికి సేవ చేయాలని, నేవీలో ఉద్యోగాలపై యువతకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేస్తున్నట్లు బృందం సభ్యులు తెలిపారు. తొలుత ఈ బృందానికి దేవస్థాన పండితులు స్వాగతం పలికారు. సత్యదేవుని దర్శనం అనంతరం వేద పండితులు ఆశీ స్సులు, ప్రసాదాలు అందజేశారు. వీరి వెం ట ఏఈఓ కృష్ణారావు, ఆర్‌ఐ ప్రసాద్ ఉన్నారు.



రుమాలీ రోటీ తయారు చేస్తున్న మాస్టర్



హలీమ్ కొనుగోలు చేస్తున్న ముస్లిమేతరులు



హలీమ్ సర్వ్ చేస్తున్న దుకాణదారుడు



దుకాణం వద్ద అమ్మకానికి సిద్ధంగా ఉన్న హలీమ్

హలీమ్.. రుచికి సలామ్

- అరబ్బులు పరిచయం చేసిన వంటకం
- హైదరాబాద్ రుచులు అద్దిన ఏడో నవాబ్ మీర్ ఉస్మాన్ ఆలీఖాన్
- నేడు ప్రపంచవ్యాప్తంగా ఇష్టమైన వంటకం
- తయారీకి సుమారు 10 గంటల సమయం
- హైదరాబాద్ తర్వాత రాజమహేంద్రవరం ప్రసిద్ధి
- స్పెషల్ అట్రాక్షన్‌గా రోటీకా రూమాల్

దీని టేస్ట్‌కి ఎవరైనా సలామ్ కొట్టి, గులామ్ కావాల్సిందే. ఒక్కసారి తింటే మళ్లీమళ్లీ తినాలపించే రుచి దీనిది. ఏడాదిలో ఒక్క రంజాన్ మాసంలోనే ఎక్కువగా లభిస్తుంది. ముస్లింలతో పాటు, వివిధ వర్గాల ప్రజలు ఎంతో ఇష్టంగా తీసుకునే హై హెల్దీ ఫుడ్ ఇది. దీని పేరే హలీమ్. హైదరా బాద్‌లో ప్రసిద్ధిగాంచి, నేడు రాజమహేంద్రవరంలో అంతగా పేరు తెచ్చుకున్న వంటకం బహుశా ఇదే కావచ్చు. హైదరాబాద్ బిర్యానీ తర్వాత అంత ఎక్కువగా జిల్లావాసులు ఇష్టపడే వంటకం హలీమ్ అనడం అతిశయోక్తి కాదు.

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఏటా రంజాన్ మాసంలో రాజమహేంద్రవరంలో సాయంత్రం 4 గం టలు దాటాక కులమతాలకతీతంగా, కుటుంబ సమేతంగా హలీమ్ షాపులకు రావడం పరిపాటిగా మారింది. ఒక్క రాజమహేంద్రరం వాసులే కాకుండా కోనసీమ, కాకినాడ, కొవ్వూరు నుంచి కూడా ఇక్కడికి వచ్చి ఈ హలీమ్ రుచి చూస్తున్నారంటే ఇదెంత ప్రసిద్ధి చెందిందో అవగతమవుతుంది.

నవాబుల కాలంలోనే..

హైదరాబాద్ ఆరో నవాబు మహబూబ్ ఆలీఖాన్‌కి అరబ్ దియాస్పార తెగకు సంబంధించిన వారు ఈ హలీమ్‌ని పరిచయం చేశారు. అప్పుడు హలీమ్‌లో నాలుగు రకాల దినుసులను మాత్రమే వాడేవారు. తర్వాత ఏడో నవాబు మీర్ ఉస్మాన్ ఆలీఖాన్ తన వం ట వారితో బిర్యానీలా, మరింత రుచికరంగా ఉండేలా దీనిని తయారు చేయాలని సూచించారు. దీంతో బిర్యానీకి వాడే దినుసులతో హలీమ్ రూపొందించబ డింది. అంతకుముందు హలీమ్ కంటే ఇది రుచిలో మేటిగా, శక్తినివ్వడంలో మరింత మెరుగ్గా తయారైం ది. అప్పటి నుంచి హైదరాబాద్ నుంచి విదేశాలకూ ఎగుమతి కావడం మొదలైంది. అరబ్బు దేశం నుంచి వచ్చిన ఈ వంటకం.. కొత్త రుచులు సంతరించుకుని, తిరిగి అక్కడికే సరఫరా అవుతూండటం దీని విశేషం. ప్రస్తుతం అమెరికా, బ్రిటన్ వంటి 30 దేశాల ప్రజలు ఈ రుచిని ఆస్వాదిస్తున్నారు.



రాజమహేంద్రవరం జాంపేట ఆజాద్ చౌక్ సెంటర్‌లో హలీమ్ షాపులు

30 రకాల దినుసలతో..

అత్యధిక పోషకాలున్న ఆహారం ఇది. ఇందులో హై ప్రొటీన్స్, కేలరీలు పుష్కలంగా ఉన్నాయి. మూడు రకాల హలీమ్‌లున్నాయి. చికెన్ హలీమ్, మటన్ హలీమ్, వెజిట బుల్ హలీమ్ ప్రధానమైనవి. హలీమ్ తయారీలో స్వచ్ఛమైన నెయ్యి, వెన్న , గోధుములు, జీడిపప్పు, బాదం, పిస్తా, షాజీరా, యాలకులతో పాటు, సన్నగా తరిగి నేతిలో వేయించిన ఉల్లిపాయలు, పుదీనా, కొత్తి మీర వంటి సుమారు 25 రకాల వివిధ రుచికరమైన వం ట పదార్థాలను వాడుతారు.

హై హెల్దీ ఫుడ్

రుచిలోనే కాదు పోషక విలువల్లో సైతం హలీమ్‌కు సాటి ఏదీ లేదు. న్యూట్రిషియన్లు చెప్పిన మేరకు, ఇం దులో హై ప్రొటీన్, క్యాలరీస్, కాల్షియం అత్యధికంగా ఉంటాయి. శరీరంలో లోపించే విటమిన్లను సమృద్ధిగా అందించే ప్రత్యేకమైన వంటకం హలీమ్. శారీరక శక్తి లోపించిన వారికి ఇది దివ్యౌషధం లాంటిది. అందుకే అంత కఠినమైన ఉపవాస దీక్ష చేసే ముస్లింలకు తక్షణ శక్తి కోసం హలీమ్‌ని సాయంత్రం ఉపవాస దీక్ష అనం తరం ఇఫ్తార్ విందులో స్వీకరిస్తారు.

తయారీ ఇలా..

హలీమ్ తయారీ చాలా శ్రమతో కూడుకున్నది. ఇద్దరు మాస్టర్లు ఇటుకలతో తయారు చేసిన బట్టీలో మంట వద్ద 10 నుంచి 12 గంటల పాటు శ్రమించాల్సి ఉం టుంది. మంటపై అంటు పట్టకుండా నిత్యం పొడ వాటి చేతికర్రలతో గట్టిగా తిప్పుతూండాలి. ఏ మాత్రం అడుగంటినా దీని రుచి పాడవుతుంది. అం దుకే ఇది సిద్ధం కావడానికి అన్ని గంటలు పడుతుంది.

రాజమహేంద్రవరం రావాల్సిందే..

ఒకప్పుడు హలీమ్ పేరు చెపితే హైదరాబాద్ మాత్రమే గుర్తుకొచ్చేది. నేడు రాజమహేంద్రవరం కూడా దాని సరసన చేరింది. దానికి కారణం అక్కడి నుంచి వంట మాస్టర్లను తెచ్చి, అదే రుచి వచ్చేలా ఇక్కడి వ్యాపారులు ఎంతో కృషి చేశారు. రాజమహేం ద్రవరంలోని జాంపేటలో సుమారు 20 షాపుల వరకు ఏర్పాటయ్యాయి. వీటిలో సుమారు 60 మంది మాస్టర్లు పనిచేస్తున్నారు. చికెన్ హలీమ్, మటన్ హలీమ్, వెజిటబుల్ హలీమ్‌ను తయారు చేస్తున్నారు. వీటిలో చికెన్, మటన్ హలీమ్‌లే ఎక్కువగా అమ్ముడ వుతున్నాయి. చికెన్ హలీమ్ రూ.120 కాగా, మటన్ హలీమ్ రూ.160, వెజిటబుల్ హలీమ్ రూ.50కి విక్ర యిస్తున్నారు.

సంథింగ్ స్పెషల్.. రూమాలీ రోటీ

ప్రత్యేకించి ఈ ఏడాది రంజాన్‌లో హలీమ్‌తో పాటుగా, రూమాలీ రోటీ స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచిం ది. ధాబాల్లో చిన్న రోటీలు లభిస్తాయి. ఇక్కడ పెద్ద సైజులో రోటీలను ఎక్కువగా నూనె వాడకుండా, బోర్లించిన పెద్ద బానపై కాల్చి ఇస్తారు. జాంపేటకు చెందిన మహ్మద్ అబ్దుల్లా షరీఫ్(పండు) దీనిని ఈ ఏడాది నగరవాసులకు పరిచయం చేశారు. మాస్టర్ షేక్ ఫయాజ్ తన విన్యాసాలతో ప్రజలను ఆకట్టుకుం టున్నాడు. రోటీ పిండిని ముద్దగా చేసి, దానిని చేతితో పెద్దగా చేసి, గాల్లోకి ఎగరవేసిన తర్వాత, తిరిగి చేతప ట్టుకుని బానపై వేసి కాలుస్తున్నారు. కొత్తగా ఉన్న దీని రుచి చూసిన భోజనప్రియుల ఆహా.. అంటూ లొట్ట లేసుకుని తింటున్నారు. చికెన్ గ్రేవీ, మటన్ బోన్ గ్రేవీతో రూ.50 నుంచి రూ.80 వరకు విక్ర యిస్తున్నారు.

జీఐఎస్ స్టేటస్‌లో గుర్తింపు

2010 భారతదేశంలో జియోగ్రాఫికల్ ఇండికేషన్ స్టేటస్‌లో హలీమ్ గుర్తింపు పొందింది. వంటకం పేరుతో ఓ ప్రాంతాన్ని గుర్తించి, దానికి జీఐఎస్‌లో నమోదు చేస్తారు. ఈ విధంగా హైదరాబాద్ హలీమ్ పేరుతో గుర్తింపు పొందింది. రంజాన్ మాసంలో అంతర్జాతీయంగా ఫుడ్ బిజినెస్‌లో ప్రముఖ స్థానాన్ని ఆక్రమించుకుంది.

రంజాన్ స్పెషల్ డ్రింక్ తాగాల్సిందే..

హలీమ్ తిన్న తర్వాత స్పెషల్ రంజాన్ డ్రింకులను తాగకుండా వెళ్లలేరు. ఫ్రూట్ సలాడ్, ఫాలుదా, డ్రైఫ్రూట్ ఐస్‌క్రీమ్, షర్బత్, జీరా సోడా వంటి పానీ యాలకు గిరాకీ ఎక్కువ.

శ్రమతో కూడుకున్నది



తయారీకి 10 నుంచి 12 గంటల వరకు పడుతుంది. తెల్లవారుజా మున ప్రారంభిస్తే, సాయంత్రం 4 గంటలకు అందించగలం. పెద్ద పొయ్యి పెట్టి వాటిపై పెద్ద బానలు పెట్టి వంట చేస్తాం. ఒక్కో బానలో 10 కేజీల హలీమ్ తయారవుతుంది. 10 కేజీల చికెన్, 10 కేజీల మటన్, 10 కేజీల వెజిటబుల్ హలీమ్ తయారు చేస్తాం. మూడు తరాల నుంచి హలీమ్ తయారీలో ప్రావీణ్యం ఉంది.

– చాంద్, హలీమ్ తయారీదారు

తింటూంటే జివ్వుమంటుంది

ప్రతి సంవత్సరం ఇక్కడ అమ్ముతున్న హలీమ్‌ను క్రమం తప్పకుండా తింటున్నాను. దీని టేస్ట్‌కి మరేది సాటి రాదు. చికెన్ హలీమ్, మటన్ హలీమ్ చాలా టేస్టీగా ఉంటాయి. నోటిలో పెట్టుకుంటే ఇట్టే కరిగిపో తాయి. పేస్టు చేసినట్టుగా ఉండటంతో, నమిలి మిం గాల్సిన అవసరం లేకుండా, గొంతులోకి ఇట్టే జారిపో తుంది. అందుకే రంజాన్ మాసంలో క్రమంతప్పకుం డా తింటాను.

– ఎం.చిన్నా, రాజమండ్రి వాసి

కుటుంబ కథా చిత్రం ‘పౌరుషం’

- చిత్ర హీరో, దర్శకుడు షెరాజ్ మెహ్దా

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): అన్ని వర్గాల వారు మెచ్చేలా కుటుంబ కథా చిత్రంగా ‘పౌ రుషం’ చిత్రాన్ని రూపొందించామని చిత్ర దర్శకుడు, హీరో షెరాజ్ మెహ్దా వెల్లడించారు. చిత్ర ప్రమోష న్‌లో భాగంగా యూనిట్ ఆదివారం స్థానిక రంభ, ఊర్వశి, మేనక కాంప్లెక్స్‌కు వచ్చింది. ఈ సందర్భం గా జరిగిన విలేకరుల సమావేశంలో దర్శకుడు, హీరో షెరాజ్ మెహ్దా మాట్లాడుతూ, యువిటీ హాలీ వుడ్ స్టూడియోస్(యూఎస్ఏ), శ్రేయ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అశోక్ ఖుల్లార్, దేవేంద్ర నేగి నిర్మించిన ఈ చిత్రంలో ముఖ్య పాత్రలను సుమ తల్వార్, మేకా రామకృష్ణ, అశోక్ ఖుల్లార్, జ్యోతిరెడ్డి, ఆమని, శైలజ తివారి, అనంత్, కనిక, జబర్దస్త్ కార్తిక్, కట్టప్ప, గం గాధర్ పోషించారని తెలిపారు. కుటుంబ విలువలు, అన్నాచెల్లెళ్ల అనురాగం, ప్రేమ పేరుతో యువతులు మోసంపోవడం వంటి అంశాలను ఈ చిత్రంలో చూపించామన్నారు. రాజమండ్రికి చెందిన సినీ హీరో గంగాధర్ ఈ చిత్ర నిర్మాణానికి సహకారం అందించారని కృతజ్ఞతలు తెలిపారు. చిత్రానికి తానే సంగీతాన్ని సమకూర్చినట్టు తెలిపారు. నిర్మాత అశోక్ ఖుల్లార్ మాట్లాడుతూ, ఈ చిత్రం అనుకున్న దానికంటే చాలా బాగా వచ్చిందన్నారు. నటుడు గం గాధర్ మాట్లాడుతూ, చిత్రంలో తాను సుమ కుమా రుడిగా, హీరోయిన్‌కు సోదరుడిగా నటించానన్నారు. తనకు మంచి పాత్ర ఇచ్చిన షెరాజ్ మెహ్దాకు ధన్యవా దాలు తెలిపారు. ముందుగా చిత్ర యూనిట్‌కు థియే టర్ వద్ద ఘన స్వాగతం లభించింది.



సమావేశంలో మాట్లాడుతున్న షెరాజ్ మెహ్దా, చిత్రంలో అశోక్ ఖుల్లార్, గంగాధర్

ఉమ్మడి జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక

- 14 నుంచి పులివెందులలో రాష్ట్ర స్థాయి పోటీలు

సామర్లకోట: వైఎస్సార్ జిల్లా పులివెందులలో ఈ నెల 14 నుంచి మూడు రోజుల పాటు జరిగే 34వ సబ్ జూనియర్స్ రాష్ట్ర స్థాయి బాల, బాలికల కబడ్డీ పోటీలకు ఉమ్మడి జిల్లా జట్లను ఆదివారం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో ఎంపిక చేశారు. కాకినాడ, రాజమహేంద్రవరం, కిర్లం పూడి, సామర్లకోట, ప్రత్తిపాడు, పెద్దాపురం, జగ్గం పేట, పిఠాపురం, రామచంద్రపురం మండలాల నుంచి బాలుర విభాగం నుంచి 40 మంది, బాలి కల విభాగం నుంచి 25 మంది ఎంపికకు హాజర య్యారు. ప్రతిభ ఆధారంగా బాలుర జట్టును నిమ్మ కాయల కిరణ్, పవన్ కుమార్, బాలికల జట్టును ఎస్.శ్వేత, డి.దేవికుమారి ఎంపిక చేశారు



ఎంపిక కోసం తలపడుతున్న బాలురు



బాలికల జట్టుతో కమిటీ ప్రతినిధులు

బాలబాలికల జట్లు ఇవే..

ఉమ్మడి జిల్లా బాలికల జట్టులో ఎంవీ దుర్గామ హాలక్ష్మి, ఎస్.భవాని, టి.మహేశ్వరి, బీఎం వరలక్ష్మి, సీహెచ్‌వీఆర్‌పీ దుర్గాభవాని, డి.ది వ్యశ్రీ, ఎ.లోకిభవాని, సీహెచ్ఎల్ ప్రత్యూష, ఎం ఎల్‌వీ దుర్గ, జి.శిరీష, వర్షిణి ఉన్నారు. అదేవిధం గా బాలుర జట్టులో జి.త్రిమూర్తులు, జి.నరేష్, సీహెచ్ఎన్‌కే రెడ్డి, కె.అభిరామ్, కె.ప్రవీణ్‌కు మార్, సీహెచ్‌పీవీవీఎస్ శ్రీహర్ష, వి.సత్యచరణ్, వై.సామ్రాట్, జి.వీరబాబు, ఎం.దుర్గాప్రసాద రావు ఎంపికయ్యారు. ప్రో కబడ్డీ అంపైర్ బోగిళ్ల మురళీకుమార్, కబడ్డీ సంఘ ప్రతినిధులు పర్యవేక్షించారు.

జోరుగా.. హుషారుగా ఎడ్ల పందేలు

- సీనియర్స్ విభాగంలో ధర్మవరం ఎడ్ల జత ప్రథమం
- ద్వితీయ, తృతీయ స్థానాల్లో కొవ్వాడ, జి.మేడపాడు ఎడ్లు

ప్రత్తిపాడు రూరల్: పెద్దిపాలెంలోని వైఆర్సీ కాలువ గట్టుపై నిర్వహించిన ఎడ్ల పరుగు పందేలు ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. రాష్ట్ర స్థాయి ఎడ్ల బండ్ల పరుగు పందెం పోటీలకు జిల్లా నలుమూలల నుంచి రైతులు, ఎడ్ల పందేల అభిమానులు తరలివచ్చి ఆస క్తిగా తిలకించారు. ఈ పోటీల్లో 31 ఎడ్ల జతలు పాల్గొన్నాయి. సీనియర్స్ విభాగంలో ఏడు, జూనియర్స్ విభాగంలో 24 ఎడ్ల జతలు పాల్గొన్నాయి.

విజేతగా ధర్మవరం ఎడ్ల జట్టు

సీనియర్ విభాగంలో కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరానికి చెందిన జువ్వల సత్తిబాబు ఎడ్ల జట్టు ప్రథమ స్థానం సాధించింది. కొవ్వాడకు చెందిన మట్టా నవనీత్ శ్రీమణికంఠ ఎడ్లు ద్వితీయ బహుమతిని, జి.మేడపాడుకు చెందిన మలిరెడ్డి అన్నపూర్ణ ఎడ్లు తృతీయ బహుమతులను కైవసం చేసుకున్నాయి. సీనియర్స్ విభాగంలో ప్రథమ, ద్వి తీయ, తృతీయ స్థానాలు కైవసం చేసుకున్న విజేత లకు వరుసగా రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.8 వేల నగదు, షీల్డ్‌ను అందజేశారు. అదేవిధంగా జూనియర్ విభాగంలో కాపవరానికి చెందిన కుం చం మనోజ్ ఎడ్ల జట్టు ప్రథమ స్థానాన్ని, హుకుంపే టకు చెందిన కురుమళ్ల వీరవెంకట సత్య జైవర్ధన్ ఎడ్ల జట్టు ద్వితీయ, కొవ్వాడకు చెందిన మట్టా నవీ నీత్ శ్రీమణికంఠ ఎడ్లు తృతీయ స్థానాన్ని సాధిం చాయి. ఇందులో విజేతలకు వరుసగా రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేల నగదు, షీల్డ్‌ను ప్రదానం చేశారు. న్యాయనిర్ణేతలుగా యనమల కృ ష్ణ, సిద్ధా నానాజీ, చెకూరి రామకృష్ణ వ్యవహరిం చారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్సై లక్ష్మి బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత ముదునూరి మురళీకృష్ణంరాజు పాల్గొన్నారు.



పరుగుతీస్తున్న ఎడ్లు

రేషన్ బియ్యం పట్టివేత

నిడదవోలు: జాతీయ రహదారిపై పెరవలి మం డలం కండవల్లి వద్ద ఆది వారం తెల్లవారుజామున అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పౌర సర ఫరాల అధికారులు పట్టు కున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా తూర్పు విప్పర్రు గ్రామం నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపా లేనికి వ్యాన్‌లో అక్రమం గా తరలిస్తున్న సుమారు 10 టన్నుల రేషన్ బియ్యాన్ని పౌర సర ఫరాల శాఖ పెరవలి డిప్యూటీ తహసీల్దార్ ఎస్ఎస్ సుధీర్‌రెడ్డి తన సిబ్బందితో సీజ్ చేశారు. పౌర సరఫరాల చట్టం 6ఏ కేసు నమోదు చేశారు. వ్యాన్‌ను పెరవలి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వాహనం డ్రైవర్ తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన వైచర్ల శివ కిరణ్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసినట్టు సుధీర్‌రెడ్డి తెలిపారు.



సీజ్ చేసిన రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వ్యాన్

షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

- మూడిళ్లు దగ్ధం • రూ.2 లక్షల ఆస్తినష్టం



మంటల్లో కాలిపోతున్న ఇళ్లు

అమలాపురం రూరల్: మండలంలోని సమనస పరిధిలో ఉన్న రంగాపురం బాబునగర్‌లో ఆదివారం అగ్ని ప్రమాదం సంభవించి, మూడు ఇళ్లు దగ్ధ మయ్యాయి. షార్ట్ సర్క్యూట్ కారణంగా సత్తాల చింతాలు, ఆకుమర్తి పురుషోత్తమరాజు, సత్తాల దుర్గారావుకు చెందిన ఇళ్లు అగ్ని ప్రమాదానికి గురయ్యాయి. సమాచారం అందుకున్న అమలాపురం అగ్నిమాపకాధికారి మురళీ కొండబాబు ఆధ్వర్యంలో సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. వేగంగా మంటలు చుట్టుముట్టడంతో ఇళ్లల్లోని వస్తువులు తీసుకునే అవకాశం లేకుండా పోయిందని బాధితులు విలపిం చారు. ఫర్నిచర్, ధ్రువీకరణ పత్రాలు, నగదు తదితర వస్తువులు బూడిద య్యాయి. ఈ సంఘటనలో సుమారు రూ.రెండు లక్షల ఆస్తినష్టం వాటిల్లిం దని అధికారులు తెలిపారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు బాధితు లను పరామర్శించారు. బాధితులకు 25 కేజీల బియ్యం, రూ.10 వేల వం తున సాయం అందించారు.

శ్రమజీవులను మింగేసిన మృత్యువు

- వేర్వేరు చోట్ల ఇద్దరు యువకుల మృతి
- మినీవ్యాన్ ఢీకొని నిడదవోలు వాసి దుర్మరణం

నిడదవోలు: పొట్టకూటి కోసం ఉన్న ఊరిని వదిలి.. పొరుగు ప్రాంతానికి వెళ్లిన వారు.. విగత జీవు లయ్యారు. ఒకరు రాష్ట్ర సరిహద్దులు దాటి వెళ్లి.. కన్న వారికి కడుపుకోత మిగిలిస్తే.. మరొకరు పొరుగూరుకు వెళ్లి.. పని ముగించుకుని వస్తూ తిరిగిరాని లోకానికి పయనమయ్యారు. వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన ఈ ఘటనలు వారి గ్రామాల్లో విషాదాన్ని నింపాయి.

నిడదవోలు పట్టణంలో ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదా రిపై ఏపీఈపీడీసీఎల్ డీఈఈ కార్యాలయం వద్ద ఆది వారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృ తి చెందాడు. వివరాల్లోకి వెళితే, మండలంలోని పం దలపర్రు గ్రామానికి చెందిన సంకు నానిబాబు(18) తాపీ పని చేస్తుంటాడు. చాగల్లు మండలం బ్రాహ్మణ గూడెంలో పని ముగించుకుని ఇంటికి బైక్‌పై బయలు దేరాడు. పట్టణంలో ఏపీఈపీడీసీఎల్ కార్యాలయం వద్దకు వచ్చేసరికి నిడదవోలు నుంచి చాగల్లు వెళు తున్న మినీ వ్యాన్.. మరో వాహనాన్ని తప్పించపోయి అతడి బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో నానిబాబు అక్కడికక్కడే మృతిచెందాడు. అతడి తండ్రి చిన్నతనం లోనే మృతిచెందాడు. తల్లి సంకు దుర్గకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. తండ్రి చనిపోవడంతో, నాని బాబు చిన్నతనం నుంచే తల్లికి చేదోడువాదోడుగా ఉం టూ కుటుంబ పోషణకు భుజాన వేసుకున్నాడు. గ్రామంలో అందరితో కలివిడిగా ఉంటే నానిబాబు మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అల ముకున్నాయి. కుటుంబానికి ఆసరాగా ఉన్న నాని బాబు మరణవార్తను అతడి కుటుంబ సభ్యులు జీర్ణిం చుకోలేకపోతున్నారు. కన్నీరుమున్నీరుగా విలపిస్తు న్నారు. రాంగ్ రూట్‌లో వచ్చిన మినీవ్యాన్ రూపంలో మృత్యువు అతడిని బలితీసుకుంది. వ్యాన్ డ్రైవర్ స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. పట్టణ ఎస్సై పరమహంస సంఘటన స్థలాన్ని పరిశీలిం చారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



ఘటనా స్థలంలో నానిబాబు మృతదేహం

హైదరాబాద్‌లో జొన్నలంక యువకుడి మృతి

పి.గన్నవరం: జీవనోపాధి కోసం హైదరాబాద్‌లో ఉంటున్న యువకులు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. వీరిలో ఒకరు మృతి చెంద డంతో అతడి స్వగ్రామమైన జొన్నలంకలో విషాద ఛాయలు అలుముకు న్నాయి. స్థానికుల వివరాల మేరకు, హైదరాబాద్‌లో జరిగిన ఈ రోడ్డు ప్రమాదం లో పి.గన్నవరం మండలం ఎల్.గన్నవరం శివారు జొన్నల్లంకకు చెందిన చందాడి సాయివెంకటకృ ష్ణ(20)మృతి చెందగా, అదే గ్రామానికి చెందిన లం కే బాల మణికంఠ లక్ష్మీసాయి తీవ్రంగా గాయ పడ్డాడు. వీరు హైదరాబాద్‌లో వెల్డింగ్ పనులు చేస్తూ, వారి కుటుంబాలకు ఆసరాగా ఉన్నారు. శని వారం రాత్రి వారు పనులు ముగించుకుని బైక్ ఇం టికి వెళ్తుండగా, వనస్థలిపురం వద్ద డివైడర్‌ను ఢీకొన్నారు. తీవ్రంగా గాయపడిన వీరిని ఉస్మా నియా ఆస్పత్రికి తరలించగా, వెంకటకృష్ణ మృతి చెందగా, లక్ష్మీసాయి ఆస్పత్రిలో చికిత్స పొందు తున్నాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడం తో వెంకటకృష్ణ కుటుంబం దుఃఖ సాగరంలో ముని గిపోయింది. అతడి తండ్రి బాలరాజు, తల్లి, సోదరి కన్నీటి పర్యంతమయ్యారు.



వెంకటకృష్ణ (ఫైల్)